సాక్షి నంద్యాల

ఆదివారం । 10 । మార్చి । 2024




రూ.2లక్షల విరాళం

శ్రీశైలంటెంపుల్: అన్నప్రసాద వితరణకు శనివారం కడపకు చెందిన బి.సత్యనారాయణ రూ.1,00,116, బి.విష్ణువర్ధన్‌రెడ్డి రూ.1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు ఫణిధరప్రసాద్‌కు అందజేశారు.



అలరించిన నృత్య ప్రదర్శనలు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని క్షేత్ర పరిధిలోని ఆయా కళావేదికలపై శనివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు, భజనలు, నాటక ప్రదర్శనలు అలరించాయి.



కమనీయం.. కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహానందిలో శనివారం తెల్లవారుజామున మహానందీశ్వరస్వామి, కామేశ్వరి దేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు.

IIలో▸

న్యూస్‌రీల్

నేడు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు గురుకుల పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ ఐ.శ్రీదేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 5వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12గంటల వరకు, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని తెలిపారు. పరీక్ష కేంద్రానికి గంట ముందుగానే చేరుకోవాలని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్లు మూసివేయాలన్నారు.

597 మంది గైర్హాజరు

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1బీ, జువాలజీ, హిస్టరీ పరీక్షలకు 597 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీవీఈఓ సునీత తెలిపారు. జిల్లాలోని 52 పరీక్షా కేంద్రాలలో 11,623 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 11,140 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,292 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 1,178 మంది హాజరు కాగా 114 మంది గైర్హాజరయ్యారు. డీవీఈఓతో పాటు మూడు టీంలు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, రెండు టీంలు సిట్టింగ్ స్క్వాడ్‌లు పాల్గొని పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూశారన్నారు.

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.1.51 లక్షలు



స్వామి వారికి వెండి కిరీటం అందజేస్తున్న తెలంగాణ రాష్ట్రం మద్దూరు భక్తులు

బేతంచెర్ల: ఆర్ఎస్ రంగాపురం శివార్లో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి క్షేత్రానికి మాఘ మాసం మహాశివ రాత్రి శనివారం పురస్కరించుకొని భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే అలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు చేసి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం తరలివచ్చిన భక్తుల వివిధ సేవలు నిర్వహించుకోవడంతో క్షేత్రానికి రూ.1,51,510 ఆదాయం వచ్చినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు. మానవపాడు మండలం మద్దూరు గ్రామానికి చెందిన మద్దిలేటి భార్య సరోజమ్మ రూ.550 గ్రాముల వెండి కిరీటాన్ని సమర్పించారు.



ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు



మనోహరం

- శ్రీశైలంలో వైభవంగా భ్రామరీ సమేత మల్లన్న రథోత్సవం
- పరవశించిన భక్తకోటి
- హోరెత్తిన ఓం నమఃశివాయ నినాదం
- స్వామిఅమ్మవార్లకు కనుల పండువగా తెప్పోత్సవం

శ్రీశైల మల్లన్న రథోత్సవం నయన మనోహరంగా సాగింది. మహాశివరాత్రి నాడు శుక్రవారం శ్రీభ్రమరాంబాదేవిని వివాహమాడిన మల్లికార్జునస్వామి మరునాడు శనివారం సాయంత్రం క్షేత్ర పురవీధుల్లో రథంపై విహరించగా భక్తకోటి పరవశించింది. ఓం నమఃశివాయ, శంభో..శంకర నినాదం మారుమోగగా.. డప్పు శబ్దాలు ప్రతిధ్వనించగా.. కళాకారుల విన్యాసాలు అబ్బురపరుచగా.. రథం అశేష భక్తజనం మధ్య ముందుకు సాగింది. ఆ తర్వాత ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు.

– శ్రీశైలంటెంపుల్

శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు శనివారం స్వామిఅమ్మవార్లకు రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయం ముందు ఉన్న గంగాధర మండపం వద్దకు మేళతాళాలతో తోడ్కొని వచ్చారు. అనంతరం రథశాల వద్ద అర్చక వేదపండితులు రథాంగపూజ, రథాంగ హోమాది క్రతువులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో ఉంచి పూజలు చేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, కార్యనిర్వాహణాధికారి డి. పెద్దిరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఇతర జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు దేవస్థానం అధికారులు రథోత్సవ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సాత్వికబలిగా కొబ్బరికాయ, గుమ్మడికాయలను సమర్పించారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు రథోత్సవం రమణీయంగా సాగింది. రథంలో విహరిస్తున్న భ్రామరీ సమేత మల్లికార్జున స్వామిని భక్తులు కనులారా దర్శించుకుని నీరాజనాలు సమర్పించారు. ఓం నమఃశివాయ, శంభోశంకర అంటూ.. భక్తులు పరమేశ్వరుడిని కీర్తించారు. రథోత్సవం ముందు కళాకారుల నృత్యాలు, కోలాటాలు, డప్పువాయిద్యాలు, కళారూపాలు, గొరవయ్యల నృత్యాలు, భాజాభజంత్రీలు, కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పుష్కరిణిలో తెప్పోత్సవం..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి అమ్మవార్లకు ఆలయ పుష్కరిణిలో తెప్పోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ఆలయం నుంచి పుష్కరిణి వద్దకు తోడ్కొని వచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి తెప్ప పైకి చేర్చారు. అలయపుష్కరిణి చుట్టూ భక్తులు బారులుదీరగా తెప్పోత్సవం కనుల పండువగా సాగింది.



అశేష భక్తజనం మధ్య మల్లన్న రథోత్సవం

నేడు పూర్ణాహుతి..

మహాశివరాత్రి బ్రహ్మోత్సవ యాగాది క్రతువులకు ఆదివారం పూర్ణాహుతి నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారి యాగశాలలో అర్చకులు, అధికారులు పూజలు నిర్వహించి పూర్ణాహుతి నిర్వహిస్తారు. అనంతరం వసంతోత్సవం, కలశోత్సవం, త్రిశూలస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహిస్తారు.



రథాంగ పూజలు చేస్తున్న పండితులు



సాత్విక బలిగా గుమ్మడికాయలు సమర్పిస్తున్న ఈఓ, చైర్మన్ తదితరులు



రథోత్సవంలో సాధువుల ఢమరుక నాదం



ఆకట్టుకున్న యువకుల సాంస్కృతిక ప్రదర్శన

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

- ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి
- ధర్మవరంలో రూ. 2 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

డోన్: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ధర్మవరం గ్రామంలో రూ.2కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శనివారం మంత్రి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. పట్టణానికి అతి దగ్గరగా ఉన్న ధర్మవరం గ్రామం ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో అభివృద్ధికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. వైఎస్ఆర్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో నియోజకవర్గాన్ని కోట్లాది రూపాయాలతో సర్వతోముఖాభివృద్ధి చేశామన్నారు. ఒక్క ధర్మవరం గ్రామంలోనే రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టడమే కాక 240 మంది నిరుపేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేశామన్నారు. రూ.కోటితో అటు గోసానిపల్లె వరకు, ఇటు మౌళాలమ్మ గ్రామ దేవత ఆలయం వరకు రైతుల కోసం రహదారి సౌకర్యం కల్పించామన్నారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ సౌకర్యం లేక గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలియడంతో వెంటనే ఎయిర్‌టెల్ వారితో సంప్రదించి సెల్ టవర్‌ను ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. గ్రామంలో సచివాలయం, రైతుభరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, డీఈ ప్రసాద్‌రెడ్డిపాల్గొన్నారు. మంత్రి ధర్మవరం గ్రామానికి చేరుకోగానే సర్పంచ్ ఎల్లమ్మ, వైఎస్ఆర్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తిమ్మారెడ్డి, ఎల్లారెడ్డి, మాధవకృష్ణారెడ్డి, గొల్ల శ్రీనివాసులు, భూపాల్ రెడ్డి, పెద్దపుల్లారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, బోయ శ్రీరాములు ఆధ్వర్యంలో గ్రామస్తులు స్వాగతం పలికారు.



అభివృద్ధి పనుల శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ఈ రమణుడు.. మోసకారి

- మహిళను మోసం చేసిన టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి
- 2022లో డోన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు
- చంద్రబాబు, లోకేష్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోని వైనం
- ప్రస్తుతం కోట్ల వెంట ప్రచారం



టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్న వెంకటరమణ ఆచారి (సర్కిల్‌లో వ్యక్తి)

డోన్: నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి వెంట ఎన్నికల ప్రచారంలో ఓ చోట నేత పాల్గొంటుండటంతో ప్రజలు, మహిళలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అతనిపై అనేక కేసులున్నా ఆ పార్టీ అధిష్టానం చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో ఆశ్చర్యం కలుగుతోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో డిప్యూటీ సీఎంగా ఉన్న కేఈ కృష్ణమూర్తి పీఏనని చెప్పుకొని తిరిగే ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామానికి చెందిన వెంకటరమణ ఆచారి మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించి కేసుల్లో ఇరుక్కుని దర్జాగా ప్రజల మధ్య తిరుగుతున్నాడు. విశాఖపట్నంలోని జీఎంఆర్ గార్డెన్స్ డ్రైవర్స్ కాలనీకి చెందిన రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు గోడి అరుణ డోన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పార్టీలో ఉన్నప్పుడు పరిచయాన్ని ఆసరాగా చేసుకొని సంబంధం ఏర్పరుచుకున్నాడు. తర్వాత తనను అనేక రకాలుగా అనుమానిస్తూ చిత్రహింసలు పెట్టేవాడని ఆమె డోన్ పోలీసులకు అప్పట్లో ఫిర్యాదు చేశారు. అంతేకాక తనతో చనువుగా ఉన్న ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పెడతానని బ్లాక్‌మెయిల్ చేయడమే కాక అనేక రకాలుగా వేధించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై ఆమె వైజాగ్‌కు చెందిన దిశ ఉమెన్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ అనే ఎన్‌జీఓ సంస్థ సభ్యులను ఆశ్రయించి డోన్‌లోని వెంకటరమణ ఆచారి స్వగృహానికి వారిని తీసుకువచ్చి నిలదీశారు. అయితే అతను మహిళలపై అమానుషంగా దాడిచేసినట్లు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక పోలీసుస్టేషన్ వద్ద పాత్రికేయులతో అప్పట్లో మాట్లాడుతూ.. టీడీపీలో ఇలాంటి నాయకుల పట్ల పార్టీ అధినాయకుడికి చెడ్డపేరు వస్తుందని, పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కూడా ఆమె డిమాండ్ చేశారు. డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఇలాంటి వారికి సహకరించకూడదని కూడా ఆమె కోరింది. ఈ విషయంపై పార్టీ అధినేత చంద్రబాబునాయుడుతో పాటు నారాలోకేష్‌కు కూడా ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని బాధితురాలు కోడి అరుణతో పాటు ఎన్‌జీఓ సంస్థ ప్రతినిధి శ్రీదేవి అప్పట్లో వాపోయారు.



డోన్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్న బాధిత మహిళలు (ఫైల్)

కేసు వివరాలు ఇలా..

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి, డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి పీఏనని చెప్పుకొనే చంద్రపల్లె వెంకటరమణ ఆచారిపై డోన్ పట్టణ పోలీసులు సి.ఆర్.నం .323-2022, ఐపిసి 354, 354ఎ, 354డి, 506, 509, 324, 67 ఐటి యాక్ట్, 2000-208 కింద కేసు నమోదు చేశారు. గోడి అరుణతో సహజీవనాన్ని అడ్డుగా పెట్టుకొని ఆమెను అనేక రకాలుగా అనుమానిస్తూ, వేధిస్తూ, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఈ కేసులు నమోదు చేశారు. ఇలాంటి అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులు నేడు టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి వెంట తిరుగుతుండటం పట్ల డోన్ నియోజకవర్గ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

మహానందిలో అద్భుతం

- మహానందీశ్వరుడికి అభిషేకించిన పాలు రుద్రగుండంలోకి..



మహానంది: మహానంది పేరు వినగానే అందరికీ గుర్తొచ్చేది అద్భుత జలసంపద. ఎన్నటికీ తరగని స్వచ్ఛమైన నీటితో నిత్యం ప్రవహించే కోనేరులు ఓ మహాద్భుతం. నీరు ఎక్కడి నుంచి వస్తుందనేది ఇప్పటికీ అంతు చిక్కని ప్రశ్నగానే మిగిలింది. అయితే స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరుడి చెంత నుంచే నీటి ధార వస్తుందని పురాణాల్లోనూ, పెద్దలు చెబుతారు, అందుకు నిదర్శనాలు సైతం ఉన్నాయి. అందులో భాగంగానే మహాశివరాత్రి సందర్భంగా స్వయంభువుగా వెలిసిన మహానందీశ్వరుడికి శుక్రవారం రాత్రి లింగోద్భవం సందర్భంగా మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిగింది. దాదాపు రెండు వందల లీటర్ల పాలతో స్వామివారికి అభిషేకం చేశారు. మహానందీశ్వరుడికి అభిషేకం చేస్తుండగా వినియోగించిన పాలు అన్ని రుద్రగుండం కోనేరులోకి రావడం విశేషం. అభిషేకం జరుగుతుండగానే పాలు స్వామివారి కింది నుంచి కోనేరులోకి చేరింది. ఈ ఆసక్తికరమైన దృశ్యాన్ని కనులారా తిలకించిన భక్తులు స్వామివారి చెంత నుంచే నీరు వస్తుందని తెలుసుకుని అద్భుతం... అంటూ ఆనందించారు.

ప్రభుత్వ ఖాజీల నియామకం

నంద్యాల:(సెంట్రల్): ముస్లింల వివాహాలు నిర్వహించేందుకు ఉద్దేశించిన ఖాజీల నియామకాలను ప్రభుత్వం చేపట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రెండు చోట్ల ప్రభుత్వ ఖాజీలను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. అవుకు మండలం గుండ్ల సింగవరం ఖాజీగా షేక్ నూర్ అహ్మద్‌ను 10 సంవత్సరాల కాల పరిమితితో నియమించారు. కర్నూలు మండలం కేసీ కెనాల్ సౌత్ సెక్టార్ ఖాజీగా అబ్దుల్ సలాం కౌసర్ పదవీ కాలాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగిస్తూ జీవో నంబర్ 24 ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

క్లుప్తంగా

ఏపీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం


ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస గుప్త

ఎమ్మిగనూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కో–ఆర్డినేటర్, బనవాసి ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జయం శ్రీనివాస్‌గుప్త తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏపీ గురుకుల పాఠశాలలో 2024–2025 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8 తరగతుల్లో ప్రవేశానికి అర్హులైన విద్యార్థినులు ఈ నెల 31వ తేదిలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 25.04.2024న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుందన్నారు. https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అదేవిధంగా మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో రాయలసీమలోని అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాల విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిగ్రీలో మొదటి సంవత్సరం ప్రవేశానికి కూడా దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశానికి రాయలసీమ విద్యార్థులకు గ్యారంపల్లి, కొడగనహళ్లి, నాగార్జునసాగర్‌లో 30 శాతం సీట్లు రిజర్వేషన్ ఉంటుందని చెప్పారు. అలాగే ఒకేషనల్ కోర్సు ఈఈటీ, సీజీడీటీకి నిమ్మకూరులో సీట్లు ఉన్నాయన్నారు. విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష 25.04.2024న మధ్యాహ్నం 2.30 నుంచి 5 వరకు ఉంటుందని చెప్పారు. https://aprs.apcfss.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మద్యం అక్రమ రవాణాపై విస్తృత దాడులు

కర్నూలు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు మద్యం అక్రమ రవాణా, సారా తయారీ, విక్రయాలపై విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో పంచలింగాల చెక్‌పోస్టు అధికారులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ నుంచి వస్తున్న టాటా ఏసీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో 30 మద్యం బాటిళ్లు బయటపడ్డాయి. ఎదురూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు టీవీఎస్ ఎక్సెల్ వాహనంలో తెలంగాణ నుంచి మద్యం బాటిళ్లు తీసుకువస్తుండగా తనిఖీ చేసి రెండు వాహనాలను సీజ్ చేశారు. కర్నూలు బాపూజీ నగర్‌కు చెందిన శివశంకర్‌తో పాటు శ్రీనివాసులును అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. అలాగే కర్నూలు సెబ్ స్టేషన్ అధికారులు మండల పరిధిలోని మునగాలపాడు గ్రామ శివారు, ఓబులాపురం తాండాల్లో ఉన్న నాటుసారా స్థావరాలపై దాడి చేసి బట్టీలను ధ్వంసం చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా విక్రయిస్తున్న నీలి శికారి శాంతి నుంచి 15 లీటర్లు, నీలి శికారి సవిత నుంచి 30 లీటర్లు సారాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో కర్నూలు సెబ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, ఎస్‌ఐలు రెహానా బేగం, పృథ్వీరాజ్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ హ్యాండ్‌బాల్ పోటీలకు హసీన



కర్నూలు (టౌన్): జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కర్నూలుకు చెందిన క్రీడాకారిణి షేక్ హసీనా ఎంపికై నట్లు హ్యాండ్‌బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి రుద్రా రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జనవరిలో వైఎస్సార్ జిల్లాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో హసీనా ప్రతిభ చాటినట్లు పేర్కొన్నారు. ఈమె ఈనెల 10 నుంచి ఉత్త ప్రదేశ్ రాష్ట్రంలోని హత్రాస్ పట్టణంలో నిర్వహిస్తున్న 52వ జాతీయ స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు.


లలితా సంగమేశ్వరుల కల్యాణం జరిపిస్తున్న పురోహితులు తెలకపల్లి రఘురామ శర్మ


నంద్యాల: కల్యాణోత్సవం అనంతరం ప్రథమనంది ఆలయంలో దర్శనమిస్తున్న స్వామి, అమ్మవారు


కర్నూలు: మహాశివునికి అన్నాభిషేకం నిర్వహించిన దృశ్యం


మద్దికెర: బుగ్గ సంగమేశ్వరంలో రథోత్సవం

ఊరూరా 'మహా'వైభవం

మహాశివరాత్రి వేడుకలు ఉమ్మడి కర్నూలు జిల్లాలో శనివారం అంగరంగ వైభవంగా సాగాయి. శివపార్వతుల కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. అశేష భక్తజనం మధ్యం రథోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో శివునికి అభిషేకాలు జరిపారు. వేడుకల్లో యువతీ,యువకులు, చిన్నారులు సందడి చేశారు. పండుగ సందర్భంగా పలుచోట్ల ఎద్దుల పోటీలు నిర్వహించారు. – సాక్షినెట్‌వర్క్


తుగ్గలి: బోడబండ పుణ్యక్షేత్రంలో భక్తజనం మధ్య రథోత్సవం


సి.బెళగల్: గట్టు మల్లికార్జున స్వామి, భ్రమరాంబాదేవిల కల్యాణోత్సవం సందర్భంగా నందికోలు సేవ


జూపాడుబంగ్లా: తూడిచెర్లలో అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


కొలిమిగుండ్ల: గుండుమల్లేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బండను లాగుతున్న వృషభాలు


గడివేముల: భోగేశ్వరుడికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమనీయం.. మహానందీశుడి కల్యాణోత్సవం

మహానంది: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా మహానందీశుడి దంపతులకు కల్యాణోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి కల్యాణోత్సవం ప్రారంభమైంది. వేదమంత్రోచ్చారణలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. లక్షలాది మంది భక్తజనం మధ్య నూతన వధూవరులైన మహానందీశ్వరుడి దంపతులు ముత్యాల తలంబ్రాలతో మురిసిపోయారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణోత్సవం దాతలు లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మీ దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, పండిత, అర్చక బృందం ముందుగా నూతన వధూవరులను అలంకార మండపం నుంచి తీసుకొస్తూ రాజగోపురం ముందు ఎదురుకోళ్ల ఉత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచన, మాంగల్య ధారణ పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు. వరుడు మహానందీశ్వరస్వామి తరఫున గుండంపాడుకు చెందిన గంగవరపు పరమేశ్వరరెడ్డి, లక్ష్మీదేవి, వధువు శ్రీ కామేశ్వరీదేవి తరఫున గుండుపాపలకు చెందిన శివచంద్రారెడ్డి, జితేంద్రారెడ్డి కుటుంబ సభ్యులు పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఏఈఓలు ఓంకారం వెంకటేశ్వరుడు, వై. మధు, సిబ్బంది రంగన్న, నాగమల్లయ్య పాల్గొన్నారు.

పుష్పపల్లకి సేవ..

కల్యాణోత్సవం అనంతరం మహానందీశ్వరుడి దంపతులు శనివారం రాత్రి పుష్పపల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణోత్సవం దాత లక్కబోయిన ప్రసాద్ ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, రుత్వికులు స్వామివారి దంపతులను ఊరేగింపుగా తీసుకొచ్చి ప్రత్యేకంగా తయారు చేయించిన పుష్పపల్లకీలో కొలువు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.


మహానందీశ్వరుడి దంపతులకు కల్యాణోత్సవం


పుష్పపల్లకీలో కొలువైన మహానందీశుడి దంపతులు

సహకార శాఖలో పదోన్నతుల కల సాకారం

- డిప్యూటీ రిజిస్ట్రార్ల నుంచి స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి


రామాంజనేయులు,వెంకటసుబ్బయ్య, వెంకటకృష్ణ

కర్నూలు(అగ్రికల్చర్): సహకార శాఖలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పదోన్నతుల కల సాకారమైంది. 17 ఏళ్ల శ్రమను గుర్తించి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం పదోన్నతులు కల్పించడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పని చేస్తున్న 30 మందికి స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్లుగా పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారిలో ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన ఎస్.రామాంజనేయులు, వెంకటసుబ్బయ్య, వెంకటకృష్ణ ఉండటం విశేషం. కర్నూలు డివిజినల్ కో–ఆపరేటివ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రామాంజనేయులు రెండేళ్లుగా కర్నూలు జిల్లా సహకార అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయనను పదోన్నతిపై ఇక్కడే రెగ్యులర్ జిల్లా సహకార అధికారిగా నియమించారు. నంద్యాల డివిజనల్ సహకార అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటసుబ్బయ్య కూడా పూర్తి అదనపు బాధ్యతలతో నంద్యాల జిల్లా సహకార అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనను కూడా అక్కడే (నంద్యాల జిల్లా) రెగ్యులర్ సహకార అధికారిగా నియమించారు. నంద్యాల జిల్లా సహకార ఆడిట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న వెంకటకృష్ణ పదోన్నతిపై కాకినాడ జిల్లా సహకార అధికారిగా బదిలీ అయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతులు కల్పించడం ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాలకు రెగ్యులర్ డీసీవోలు నియమితులయ్యారు.

ప్రాణం తీసిన విద్యుదాఘాతం


మృతిచెందిన లక్ష్మణాచారి

కృష్ణగిరి: విద్యుదాఘాతంతో కృష్ణగిరికి చెందిన కమ్మరి లక్ష్మణాచారి(27) శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కమ్మరి నాగరాజుకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వీరు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే నాగరాజు పొలానికి ఎద్దుల బండితో వెళ్లాడు. ఇతని చిన్న కుమారుడైన లక్ష్మణాచారి ఉదయం 8 గంటలకు కరెంటు వచ్చే సమయం కావడంతో బైక్‌పై పొలానికి వెళ్లాడు. హంద్రీ–నీవా ప్రధాన కాలువ నుంచి రిజర్వాయర్‌లోకి నీరు వెళ్లే కాలువకు విద్యుత్ మోటారు వేసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారు. మోటార్ స్విచ్ ఆన్ చేసేందుకు వెళ్లగా ఇనుప పైపులకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురయ్యాడు. మోటారు వేసి వస్తానని వెళ్లిన కుమారుడు తిరిగి రాకపోవడంతో అక్కడి వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు. ఇరుగుపొరుగు రైతులు వచ్చి వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చి సరఫరా నిలిపివేయించారు. విద్యుత్ మోటారు కాలిపోయి పైపులకు విద్యుత్ సరఫరా కావడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. మృతునికి భార్య మౌనిక ఉన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ కంగాటి వెంకటరామిరెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి తెలియజేశారు. మృతుని తండ్రి నాగ రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మూర్ఛతో బాలుడి మృతి

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం మహానందికి వచ్చిన ఓ బాలుడు మూర్ఛకు గురై కోలుకోలేక మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. నంద్యాలకు చెందిన బాలస్వామి తన కుటుంబ సభ్యులతో కలిసి మహానందికి వచ్చారు. దర్శనార్థం వచ్చిన వారు స్థానిక చిన్నకోనేరులో స్నానం చేస్తుండగా వెంకట నిరంజన్(14) మూర్ఛకు గురయ్యాడు. అపస్మారకస్థితిలో ఉన్న బాలుడిని చికిత్స నిమిత్తం కోనేరు ముందు ఏర్పాటు చేసి ప్రభుత్వం ఉచిత వైద్యశిబిరం వద్దకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం 108 ద్వారా నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

బిహార్ కూలీ దుర్మరణం


మృతి చెందిన బిహార్ కూలీ జయంత్‌కుమార్

పగిడ్యాల: లక్ష్మాపురం అంచె సమీపంలో నీళ్ల ట్యాంకర్ బోల్తా పడి బిహార్‌కు చెందిన కూలీ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొలిమిగుండ్ల నుంచి హైదరాబాద్ వరకు సోలార్ పవర్‌గ్రిడ్ 765 కేవీ విద్యుత్ టవర్ పనులు జరుగుతున్నాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ 25 రోజుల క్రితం బిహార్ రాష్ట్రం పచాడి గ్రామం నుంచి 20 మంది కూలీలను తీసుకొచ్చారు. విద్యుత్ టవర్ల ఏర్పాటుకు నిర్మించిన సిమెంట్ బేష్ దిమ్మెలకు క్యూరింగ్ చేయడానికి నీళ్ల ట్యాంకర్ ట్రాక్టర్‌తో శనివారం ఉదయం కూలీ జయంత్‌కుమార్ మఖియా (26) బయలుదేరాడు. మార్గమధ్యలో లక్ష్మాపురం అంచె మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో జయంత్‌కుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ముచ్చుమర్రి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సబ్‌కాంట్రాక్టర్ అమిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ జయశేఖర్ కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మహిళల అభ్యున్నతికి అన్నివిధాలా సహకారం


డీసీసీబీ మహిళా ఉద్యోగిని కుమార్తెతో కేక్ కట్ చేయిస్తున్న చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి

కర్నూలు(అగ్రికల్చర్): మహిళల అభ్యున్నతికి ఉమ్మడి జిల్లా సహకార కేంద్రబ్యాంకు అన్ని విధాల సహకరిస్తుందని చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి తెలిపారు. శనివారం జిల్లా సహకార కేంద్రబ్యాంకులో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మహిళా ఉద్యోగిని కుమార్తెచే కేక్ కట్ చేయించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి, జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు డీసీసీబీ అన్ని విధాల సహకరిస్తోందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల 545 రోజుల కాల పరిమితితో వనిత డిపాజిట్ పథకాన్ని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో విజయకుమార్, జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులు, డీజీఎం సునీల్, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి, చీఫ్ మేనేజర్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యంతో పోలీసులు

గోనెగండ్ల: గంజిహళ్లి రోడ్డులోని మద్దికెర కుంట దగ్గర భారీమొత్తంలో కర్ణాటక మద్యాన్ని సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో శనివారం పోలీసులు పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. చిన్నమరివీడు గ్రామానికి చెందిన సునీల్, అలాగే గోనెగండ్లకు చెందిన రంగస్వామి కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన రాజశేఖర్ దగ్గర 35 బాక్సుల్లో కర్ణాటక మద్యాన్ని (జాన్స్ ఒరిజినల్ ఛాయిస్ డిలక్స్ వీస్కీ 90ఎంఎల్) కొనుగోలు చేసి మోటారు సైకిల్‌పై తీసుకొస్తుండగా మద్దికెర కుంట దగ్గర పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. సునీల్, రంగస్వామిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ తిమ్మారెడ్డి, పోలీసులు బ్రహ్మయ్య, నాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.